నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I హైదరాబాద్, సోమవారం 12 మే 2025 HYDERABAD



## వర్షసూచన

సిటీబ్యూరో, మే 11 (నమస్తే తెలంగాణ): ద్రోణి ప్రభావంతో గ్రేటర్ పరిధిలోని పలు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది. ఆదివారం రాత్రి 9 గంటల వరకు శేరిలింగంపల్లి మండలంలోని హఫీజ్‌పేట లో 1 సెంటీమీటర్, మియాపూర్‌లో 4.5 మి.మీ, మదాపూర్‌లో 2.8 మి.మీ వర్షపాతం నమోదైందని టీజీడీపీఎస్ అధికారులు తెలిపారు. కాగా ద్రోణి ప్రభావం కొనసాగుతుండటంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మరోవైపు ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ 38.9, కనిష్ఠం 27.3 డిగ్రీలు, గాలిలో తేమ 30శాతంగా నమోదైంది.



వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం శిల్పారామంలో జరిగిన నృత్యప్రదర్శన సందర్శకులను విశేషంగా అకట్టుకున్నది.

# 200 కోట్ల స్థలం కబ్జా

**ఆ 3 ఎకరాలు ఎవరి చేతుల్లో**

స్థలం అన్యాక్రాంతంపై ఫిర్యాదులు

క్షేత్రస్థాయి పర్యటనలో కమిషనర్ కీలక ఆదేశాలు



క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న బల్దియా కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

*గౌలిపురా కబేళాపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వీ కర్ణన్ ప్రత్యేక దృష్టి సారించారు. మూతపడిన కబేళా (స్లాటర్ హౌస్)ను పున ః ప్రారంభించే దిశగా కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఇటీవల గౌలిపుర స్లాటర్ హౌస్ భవనాన్ని కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. స్థానికుల నుంచి వాస్తవ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గౌలిపుర మేకలమండి గతంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో బాగా నడిచిందని, కాలనీకి చెందిన ఒక వ్యక్తి కోర్టుకు వెళ్లడంతో నిలిచిపోయిందని అధికారులు కమిషనర్‌కు వివరించారు. స్లాటర్ హౌస్ పనిచేయకపోవడంతో ఆధారపడిన కుటుంబాలు ఇబ్బందులుపడ్డాయని, కోర్టు తీర్పు ఇచ్చి చాలా రోజులవుతున్నందున యంత్రాలు, మరమ్మతులు ఇంకా కొన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కమ్యూనిటీ పెద్దలు ఈ సందర్భంగా కమిషనర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. బిల్డింగ్, యంత్రాల మరమ్మతులు, నీరు ఇతర వసతులు ఏర్పాటు చేసి త్వరలోనే పున ః ప్రారంభిస్తామని కమ్యూనిటీ పెద్దలకు కమిషనర్ వివరించారు. వెంటనే ప్రాజెక్టు ఇంజినీర్‌కు ప్రతిపాదనలు తయారు చేయాలని కమిషనర్ ఆదేశించారు.*

*- సిటీబ్యూరో, మే 11 (నమస్తే తెలంగాణ)*

### కబ్జాపై ఆరా..

గౌలిపురా కబేళాకు సంబంధించిన 4.2 ఎకరాల స్థలంతో పాటు 1961లో మరో మూడెకరాలను ఎంసీహెచ్ కొనుగోలు చేసింది. రూ. 200 కోట్ల విలువైన ఆ మూడెకరాల భూమి ఎవరి చేతుల్లో ఉందనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై కమిషనర్‌కు ఆరె కటిక సంఘం అనేకసార్లు ఫిర్యాదులు చేసింది. క్షేత్రస్థాయిలో పర్యటించిన కమిషనర్ సమగ్ర వివరాలను ఎస్టేట్ విభాగాన్ని సమర్పించాలని ఆదేశించారు.

### నిజాం కాలం నాటి నుంచి..

GHMC

గౌలిపురాలో నిజాంకాలం నుంచి కబేళా నిర్వహణ ఉంది. దీనికి సంబంధించి జీహెచ్ఎంసీకి చెందిన 4.2 ఎకరాల స్థలంలోనే కబేళా నిర్వహిస్తున్నారు. కొన్ని కారణాలతో 2003లో హైకోర్టు ఆదేశాలతో కబేళా మూతపడింది. అప్పటి నుంచి ఈ స్థలాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని కొందరు కన్నేశారు. కబ్జాదారులకు రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు కొందరు వంతపాడడంతో విలువైన స్థలాన్ని కొట్టేశారు. గౌలిపురలోని 4.2 ఎకరాల భూమిని 2010లో అప్పటి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ నవీన్ మిట్టల్ ప్రైవేట్ వ్యక్తులకు మ్యూటేషన్ చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు ఆ భూమి తమదని కోర్టును ఆశ్రయించారు. తర్వాత హైదరాబాద్ కలెక్టర్‌గా వచ్చిన గుల్జార్ గౌలిపురా భూమి మ్యుటేషన్‌ను రద్దు చేసి ప్రభుత్వానికి చెందినదిగా ప్రకటించారు. అప్పట్లో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. దీనిపై పలువురు కోర్టును ఆశ్రయించారు. అయితే ప్రభుత్వ నిర్ణయంతో అక్కడ రూ. 7 కోట్లతో రాంకీ సంస్థ మోడ్రన్ కబేళాను నిర్మించారు. ఈ నేపథ్యంలోనే కబేళాను ప్రారంభిస్తామని చెప్పిన కమిషనర్ ఆర్‌వీ కర్ణన్.. కబ్జాకు గురైన స్థలం విషయంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# పీపీపీ విభాగంలో మనదే బెస్ట్ మెట్రో



సిటీబ్యూరో, మే 11(నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న హార్వర్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ మెట్రో అంశాన్ని ప్రస్తావించింది. ప్రపంచంలోనే అత్యుత్తమ పీపీపీ మెట్రోగా పేర్కొంది. వర్సిటీ విద్యార్థుల అధ్యయనానికి పరిశోధన పత్రాలుగా మెట్రో ప్రాజెక్ట్‌ను ఎంపిక చేసుకుంది. రవాణా వ్యవస్థ నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, నిర్మాణంలో నూతన ఒరవడి, ఎదురైన సవాళ్లు, చూపిన పరిష్కారాలతో కూడిన పరిశోధన పత్రాన్ని కేస్ స్టడీగా స్వీకరించింది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రజా రవాణా వ్యవస్థలో ఒక విప్లవాత్మక మార్పు వచ్చిందని, భూసేకరణ సమస్యలు, ఆర్థిక సవాళ్లను ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశంలోనే హైదరాబాద్ మెట్రో అత్యుత్తమ మెట్రో వ్యవస్థగా పేర్కొన్నారు. దశలవారీగా చేపట్టిన ప్రాజెక్టు ప్రగతిని కేస్ స్టడీలో ప్రత్యేకంగా వివరించినట్లుగా మెట్రో సంస్థ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా ఇప్పటికే ఐఎస్‌బీ, స్టాన్‌ఫోర్డ్ లాంటి అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు హైదరాబాద్ మెట్రో రైలును ప్రస్తావించడం హైదరాబాద్ నగరానికి దక్కిన అరుదైన గౌరవమని హైదరాబాద్ మెట్రో సంస్థ ఈ మేరకు విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది.

# ఇందిరమ్మ సర్వే పూర్తయ్యేనా?




మేడ్చల్, మే 11(నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లాలో ఇందిరమ్మ పథకం లబ్ధిదారుల జాబితా ఎంపికపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో దరఖాస్తుల పరిశీలనను ఎంపీడీవోలు, కమిషనర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమక్షంలో పూర్తిచేసి జిల్లా అధికారులకు అర్హుల జాబితాను అందజేశారు. అందిన జాబితా మేరకు 30 మంది అధికారులు క్షేత్ర స్థాయిలో మరోసారి పరిశీలన చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేయాల్సి ఉంది. అయితే క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారుల ఎంపికను గత నెల ఏప్రిల్ 30 వరకు పూర్తి చేయాల్సి ఉండగా ఈనెల 10వ తేదీ పూర్తయినప్పటికీ ప్రక్రియ పూర్తి చేయలేదు. దీంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటివరకు 308 మంది లబ్ధిదారులకు మాత్రమే వర్తింపజేశారు. నియోజకవర్గానికి 3,500 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. అ మేరకు దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మేడ్చల్ నియోజకవర్గంలో 1,760, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 1,144 మంది లబ్ధిదారుల ఎంపిక జాబితాను సిద్ధం చేసినట్లు చెబుతున్నప్పటికీ అధికారులు మాత్రం ధ్రువీకరించడం లేదు.



# కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి**

నేరేడ్‌మెట్: బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం వినాయకనగర్ డివిజన్ నాగలక్ష్మి ఫంక్షన్‌హాల్లో బీఆర్ఎస్‌లో చేరిన నేరేడ్‌మెట్, మౌలాలి డివిజన్లకు చెందిన యువకులకు ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, నాయకులు పరశురాంరెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఖాళీగా 5వేల నర్సింగ్ పోస్టులు

భర్తీ చేయకపోవడంతో ఉన్నవారిపైనే అదనపు భారం
పని ఒత్తిడితో సతమతమవుతున్న వైనం

సిటీబ్యూరో, మే11,(నమస్తే తెలంగాణ): ఫ్లోరెన్స్ నైటింగేల్‌కు నివాళిగా ప్రపంచ వ్యాప్తంగా మే 12 న 'ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని' నిర్వహిస్తారు. ఈ ఏడాది 'అవర్ నర్సెస్.. అవర్ ఫ్యూచర్..కేరింగ్ ఫర్ నర్సెస్ స్ట్రెంతెన్స్ ఎకనామిక్స్' థీమ్‌తో నిర్వహిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ ప్రమాణాల ప్రకారం ఐసీయూలో 1:1 నిష్పత్తి ప్రకారం ఒక రోగికి ఒక నర్సు, హైరిస్క్ పడకల వద్ద 1:2 నిష్పత్తి ప్రకారం ఇద్దరు రోగులకు ఒక్క నర్సు, జనరల్ వార్డులో 1:5 ప్రకారం ఒక్క నర్సు ఐదు మంది రోగులకు సేవలందించాల్సి ఉంటుంది.



### 5000 ఖాళీలున్నాయి..

రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 15,500 మంది నర్సులు ఉండగా, ఇంకా సుమారు 5000 ఖాళీలు భర్తీచేయాల్సి ఉంది. ఇటీవల జరిగిన బదీలీల్లో హైదరాబాద్ జిల్లా నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు అధిక సంఖ్యలో నర్సులు బదిలీ అయ్యారు. దీంతో రాష్ట్ర రాజధానిలో ఉన్న పెద్దాసుపత్రుల్లో నర్సుల కొరతవెంటాడుతున్నది. సరిపడా సిబ్బంది లేకపోవడంతో సకాలంలో వైద్యం అందించేందుకు నర్సులు ఇబ్బంది పడుతున్నారు. అధిక పనిఒత్తిడితో సతమతమవుతున్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా మేల్ నర్సులు 800 మంది ఉండగా, 100 మందికి పైగా మేల్ నర్సులు హైదరాబాద్‌లోని ఆసుపత్రుల్లో సేవలందిస్తున్నారు.

### రోగిని కాపాడటంలోనే ఆనందం



రోగిని కాపాడుకోవాలనే తపనతోనే బంధువులు, ఇతర సహాయకుల పట్ల కాస్త కఠినంగా ఉంటాం. రోగం నయమై సత్వరంగా కోలుకుంటే ముందుగా ఆనందించేది మేమే. సహాయకులకు ధైర్యం చెప్పడం వల్ల మా కర్తవ్యాన్ని నిర్వర్తించినవాళ్లమవుతాం. ఇంట్లో కూడా రోగుల గురించే ఆలోచిస్తుంటాం.

- సుజాత రాథోడ్, గెజిటెడ్ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సెక్రెటరీ

### గొప్పగా భావిస్తున్నా..



మేల్ నర్సుగా రోగికి వైద్య సేవలందించడం గొప్పగా భావిస్తున్నా. అత్యవసర పరిస్థితి సమయాల్లో సేవలందించినప్పుడు ఓ ప్రాణాన్ని కాపాడమనే సంతోషం ఉంటుంది.

- రవికిరణ్, తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

# నగరం నడిబొడ్డున నాలాకు ముప్పు

- బఫర్ జోన్‌లో నిర్మాణపనులు
- నిబంధనలు అతిక్రమించి బ్లూషీట్స్ ఏర్పాటు
- అడ్డగోలుగా జీహెచ్ఎంసీ అనుమతులు
- ఉన్న స్థలానికి అదనంగా అనుమతి



ఉదయ్‌నగర్‌లో నాలా బఫర్ జోన్‌లో ఫెన్సింగ్ పనులు చేస్తున్న దృశ్యం

బంజారాహిల్స్, మే 11: బంజారాహిల్స్ రోడ్ నెం 11లోని ఉదయ్‌నగర్ నుంచి తాజ్ బంజారా చెరువు వైపు వెళ్లే వరదనీటి నాలాను ఆనుకుని నిర్మాణాలు వివాదాన్ని రాజేశాయి. షేక్‌పేట మండల పరిధిలోని సర్వే నంబర్ 403లో ప్రభుత్వ రికార్డుల్లో జీ-నాలాగా ఉన్న స్థలంలో శనివారం నుంచి గున్నా జైదీప్‌రెడ్డి, గున్నా సందీప్‌రెడ్డి అనే వ్యక్తులు ఫెన్సింగ్ పనులు చేస్తున్నారు. వారికి చెందిన ప్లాట్ నంబర్ 3బీకి వెనకాల నాలా బఫర్ జోన్‌లో ఫెన్సింగ్ వేస్తుండడంతో స్థానికులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా తమకు జీహెచ్ఎంసీ అనుమతులు ఉన్నాయని, నీటి పారుదలశాఖ నుంచి వచ్చిన ఎన్‌వోసీ ఉందని చెప్పారు. దీంతో పాటు తమ పనుల్లో జోక్యం చేసుకోకుండా కోర్టులో ఆదేశాలు సైతం ఉన్నాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఈ వ్యవహారంపై లోతుగా విచారించగా కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. బంజారాహిల్స్ నాలాగా పిలిచే ఉదయ్‌నగర్ నాలాలో ఎడమవైపు సుమారు 400 గజాల ఖాళీ స్థలం ఉంది. నాలా బఫర్ జోన్ పరిధిలోకి వచ్చే ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా గత ప్రభుత్వాలు జాగ్రత్తలు తీసుకున్నాయి. ఈ స్థలాన్ని ప్రభుత్వ స్థలంగా పేర్కొని హెచ్చరిక బోర్డు సైతం ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా 2023 అక్టోబర్‌లో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో జీహెచ్ఎంసీ బీపాస్ ద్వారా జైదీప్‌రెడ్డి, సందీప్‌రెడ్డిలు ప్లాట్ నంబర్ 3బీలో భవన నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ స్థలంలో నాలా ఉండడంతో నీటిపారుదలశాఖ క్లియరెన్స్ కోసం వెళ్లింది. మొత్తం 692.79 చదరపు మీటర్ల స్థలంలో నిర్మాణం కోసం అనుమతులు కోరగా నాలా నుంచి 2మీటర్ల మేర బఫర్ జోన్ వదిలిపెట్టాల్సి ఉంటుందని అధికారుల పరిశీలనలో తేలింది. దీంతో 16.76 చదరపు మీటర్ల స్థలం బఫర్ జోన్‌లోకి వస్తుందని, మిగిలిన 676 చదరపు మీటర్లలో నిర్మాణాలను చేపట్టుకోవచ్చని నీటిపారుదలశాఖ అధికారులు ఎన్‌వోసీ జారీ చేశారు. అయితే ఎన్‌వోసీ కోసం ఇచ్చిన దరఖాస్తులో 676 చదరపు మీటర్ల స్థలం చూపించిన నిర్మాణదారులు జీహెచ్ఎంసీ అనుమతి కోసం పెట్టిన దరఖాస్తులో ఏకంగా 1005 చదరపు మీటర్ల స్థలంలో ప్లాన్ చూపించడం, సర్వే నంబర్ 403 ప్రభుత్వ భూమి కావడంతో మరింత స్పష్టతకోసం రెవెన్యూ క్లియరెన్స్ తీసుకోవాల్సి ఉంటుందంటూ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ దరఖాస్తును తిరస్కరించారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది జనవరిలో మరోసారి బీ పాస్ ద్వారా గున్నా జైదీప్‌రెడ్డి, సందీప్‌రెడ్డి తరపున శివరాజ్ అనే వ్యక్తి జీహెచ్ఎంసీ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పర్యటన చేయకపోవడంతో పాటు కనీసం రెవెన్యూ క్లియరెన్స్ లేకుండానే జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు ఇచ్చేశారు. ఈ నేపథ్యంలో శనివారం నుంచి స్థలం చుట్టూ ఫెన్సింగ్ పనులు ప్రారంభించారు. అయితే ఎన్‌వోసీలో చూపిన విధంగా 2మీటర్ల మేర బఫర్ జోన్ ఉండగా కేవలం 1మీటర్ బఫర్ జోన్ వదిలిపెట్టి ఫెన్సింగ్ నిర్మాణం చేస్తున్నారు. దీంతో పాటు తమ స్థలం పక్కనున్న సుమారు 300 గజాల ఖాళీ స్థలాన్ని కూడా ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేయడం వివాదాస్పదంగా మారింది. ఈ వ్యవహారంలో జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారుల వ్యవహారశైలి అనుమానాలను కలిగించేలా ఉందని స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. సుమారు 30ఏళ్లుగా బస్తీ వాసులకు ఉపయోగంగా ఉన్న 300 గజాల ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమిస్తున్నారని, కోర్టు ఆర్డర్ పేరుతో తన స్థలానికి పక్కనున్న స్థలాన్ని కూడా ఆక్రమిస్తున్నారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై అధికారులు, సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




## 55 ఏండ్ల తర్వాత.. ఆత్మీయంగా..

ఖైరతాబాద్, మే 11 : సోమాజిగూడలోని ఓ హోటల్‌లో ఆదివారం నల్గొండ జిల్లాలోని మల్టీపర్పస్ హైస్కూల్ 1970 బ్యాచ్‌కు చెందిన 12వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం వేడుకగా సాగింది. సుమారు 55 ఏండ్ల తర్వాత కలుసుకున్న వారంతా.. ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్నప్పటి రోజులు, గురువులు, వారి బోధనలను గుర్తు చేసుకున్నారు. అప్పటి చదువులకు ఇప్పటికీ చాలా తేడా ఉన్నదని, నాడు గురువులను గౌరవించుకునేవారంటూ విశ్రాంత పోస్టల్ ఉద్యోగి వెంకన్న గుర్తు చేశారు. నాటి గురువులు నేర్పిన చదువు, సంస్కారం వల్లే తాను ఉన్నత స్థానాలకు చేరకున్నానని మరో పూర్వ విద్యార్థి వినోద్ అన్నారు. ఏ సెక్షన్ నుంచి జీ సెక్షన్ వరకు సుమారు 400 మంది విద్యార్థులుండే వారని, ప్రస్తుతం 81 మంది మాత్రమే వచ్చారంటూ వ్యాపారి మంచుకొండ ప్రకాశం అన్నారు.

# కాల్పులు ఎందుకు విరమించాం !

నగరంలో ఇదే హాట్ టాపిక్



సోషల్‌మీడియాలోనూ అదే ముచ్చట

సిటీబ్యూరో: భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ అనే అంశంపై నగరవ్యాప్తంగా చర్చ నడుస్తోంది. ఇద్దరు వ్యక్తులు కలిశారంటే అదే చర్చ... సోషల్‌మీడియా వేదికలపైనా అదే టాపిక్. ఒకరు కాల్పుల విరమణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తే.. మరికొందరు సమర్థిస్తున్నారు. మరికొందరు 1971 నాటి పరిస్థితులను గుర్తు చేసుకుంటూ ఇందిరాగాంధీ ప్రస్తావన తెస్తున్నారు. ఉగ్రవాదులను తయారు చేసే ఫ్యాక్టరీగా మారిన పాకిస్తాన్‌కు ఐఎంఎఫ్ ఫండింగ్ ఇవ్వడంపై కూడా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్తాన్ నడ్డివిరిచే అవకాశం వచ్చిందని.. అది జరుగుతుందని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న క్రమంలో కాల్పుల విరమణ ప్రకటన వచ్చిందంటూ ప్రజలు మాట్లాడుకుంటున్నారు. సోషల్‌మీడియాలోనూ కాల్పుల విరమణ టాపిక్‌కే. వాకింగ్ గ్రౌండ్స్, హోటల్స్, మార్కెట్లు, ఫంక్షన్ల వద్ద కూడా ఇదే అంశంపై మాట్లాడుకుంటున్నారు.